సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



14న జాతీయ లోక్‌అదాలత్

ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గ తెలిపారు.

- 8లో ▸



నర్సింగ్ కళాశాలలో..

మాక్లూర్ నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.1 /16.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పాఠశాలల బంద్

నిజామాబాద్‌అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించాయి. నగరంలో కొన్ని పాఠశాలలు పూర్తిగా బంద్ పాటించగా, మరికొన్ని చోట్ల యథావిధిగా కొనసాగాయి. బంద్ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, యూఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈనెలకు సంబంధించి సదరం క్యాంపుల తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 4, 11 అలాగే 18 తేదీల్లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగ నిర్ధారణ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇది వరకే మీసేవ కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకున్న వారి మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ వచ్చిన తేదీ ప్రకారం హాజరు కావాలని, కొత్తగా నమోదు చేసుకునే వారికి కూడా ఎస్‌ఎంఎస్ వస్తుందని తెలిపారు. సదరం క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు మీ సేవ రసీదుతో పాటు మెడికల్ రిపోర్టులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో తమకు కేటాయించిన తేదీల్లో సదరం క్యాంపునకు హాజరుకావాలని సూచించారు.

నూతన కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు



ఖలీల్‌వాడి: శిక్షణ పూర్తి చేసుకున్న ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు ఇస్తూ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధుశర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 344 మంది నూతన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఇందులో సివిల్ కానిస్టేబుళ్లు పురుషులు 150, మహిళలు 68మంది, ఏఆర్ కానిస్టేబుళ్లు 87 మంది పురుషులు, 39 మంది మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలు సర్వీసు మొత్తం పనికివస్తాయని, క్రమశిక్షణతో మెలుగుతూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏఆర్ ఏసీపీ నాగయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీశ్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలలపై లైంగిక హింసను నిరోధిద్దాం



ఖలీల్‌వాడి: బాలలపై హింస, లైంగిక దాడులను నిరోధించాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉందని జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్ లో న్యాయమూర్తి శనివారం విలేకరులతో మాట్లాడారు. పోక్సో చట్టం విశిష్టతను వివరించారు. పోక్సో చట్టం ప్రకారం ప్రత్యేక పోక్సో కోర్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోక్సో చట్టం అమలుతో బాలికలకు చట్టపరమైన రక్షణ పెరిగిందన్నారు. ఇంటర్నెట్ ను సరైన మార్గంలో వినియోగించకపోవడం పిల్లలపై దుష్ప్రభావాన్ని చూపుతోందన్నారు. డ్రగ్స్ వినియోగం, సత్ప్రవర్తన లేకపోవడం, సభ్యత సంస్కారాలు లోపించడం వంటి పరిస్థితులు మగ పిల్లలపై ప్రభావం చూపిస్తున్నాయని న్యాయమూర్తి అన్నారు. నేరాల తీవ్రతనుబట్టి పోక్సో చట్టం ప్రకారం ఇరవై ఏళ్ల వరకు జైలు శిక్ష, ఉరిశిక్ష సైతం విధించే అవకాశం ఉంటుందని వివరించారు.


దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్ధిస్ట్, పార్శీలు) 2024 విద్యా సంవత్సరానికి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకానికి (సీఎం ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం) దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధికారి నాగోరావు సూచించారు. విద్యార్థులు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాలకు 97003 51786 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలకులు.. శాసనాలు

పౌరాణిక ప్రాశస్త్యం, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఇందూరు ప్రాంతం నిరంతరం తన ప్రత్యేకతను నిలుపుకుంటూనే ఉంది. అనేక పౌరాణిక, చారిత్రక అంశాలను తనలో ఇముడ్చుకుంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో అనేక ఆలయాలు అందుకు సాక్షిభూతంగా నిలిచి ఉన్నాయి. మరోవైపు ఆనాటి పాలకులు వేసిన శాసనాలు జిల్లాలో అనేక విడతల్లో బయటపడ్డాయి. ఈ శాసనాలు నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను చెబుతూ వచ్చాయి. ఇప్పటికీ జిల్లాలో అక్కడక్కడా అప్పటి శాసనాలు బయటపడుతూనే ఉన్నాయి. వీటి ద్వారా అనేక అంశాలను తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



సండే స్పెషల్

- ఇందూరు సీమలో వెలుగు చూసినవి అనేకం
- ఏకచక్రపురంగా భాసిల్లిన బోధన్‌లో ఎక్కువ సంఖ్యలో లభ్యం
- ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాసనాలు
- గత ఏడాది ఉమ్మెడ వద్ద బహిర్గతమైన కల్యాణి చాళుక్యుల శాసనాలు
- నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక స్థితులు తెలుసుకునే వీలు..


కల్యాణి చాళుక్యుల ఉమ్మెడ-2 శాసనం



శాసనాలు కను మరుగయ్యాయి. అయితే అవి వివిధ సందర్భాల్లో వెలుగుచూస్తున్నాయి. చరిత్ర పరిశోధకుల శోధనలోనూ బయటపడుతున్నాయి.

కొత్తరాతి యుగం ఆనవాళ్లు..

గత ఏడాది జిల్లాలోని నందిపేట మండలం శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఏరియాలో ఉమ్మెడ వద్ద కొత్తరాతియుగం ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇదే ప్రాంతంలో రెండుచోట్ల కల్యాణి చాళుక్యులు వేసిన ఉమ్మెడ-1, ఉమ్మెడ-2 శాసనాలు సైతం గత ఏడాది వెలుగు చూశాయి. ఇప్పటివరకు ప్రచురితమైన నిజామాబాద్ జిల్లా శాసన సంపుటిలో ఈ శాసనాలు లేవని, ఇవి కొత్తగా కనుగొనబడినవని చరిత్ర పరిశోధకులు తెలిపారు.



కల్యాణి చాళుక్యుల ఉమ్మెడ-1 శాసనం

బోధన్‌లో వెలుగుచూసిన శాసనాలు



ఇందూరును పాలించిన రాజులు

ఇందూరు సీమను శాతవాహనులు, విష్ణుకుండినులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, బోధన్ చాళుక్యులు, కాకతీయులు, పద్మనాయకులు, కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు, దోమకొండ, సిర్నాపల్లి, కౌలాస్ సంస్థానాధీశులు పాలించారు. ఇంతమంది పాలకులు వారి పాలనాకాలంలో పలు ప్రాంతాల్లో అనేక శాసనాలు వేయించారు. కాలక్రమంలో ఆ

- ఉమ్మెడ-1 శాసనం ప్రాచీన ఉమామహేశ్వరాలయం సమీపంలో వెలుగు చూసింది. కల్యాణి చాళుక్యుల కాలంలో 5వ త్రిభువనమల్ల విక్రమాదిత్యుడు వేయించినదిగా గుర్తించారు. 17 పంక్తులున్న ఈ శాసనంలో లిపి తెలుగన్నడం (తెలుగు అర్థమే కన్నడ భాషలో) ఉంది. 1,008–1,014 సంవత్సరాల మధ్య వేయించినట్లు నిర్ధారించారు. దీని ప్రకారం కాలం.. శక సంవత్సరం 933 ఫాల్గుణ మాస సోమగ్రహణ సందర్భం, 1,012 ఫిబ్రవరి 10 ఆదివారంగా ఉంది.
- ఉమ్మెడ-2 శాసనం 1వ జగదేకమల్లుని కాలంలో వేశారు. దీన్ని గణపతి గుండు శాసనంగా చరిత్ర బృందం తెలిపింది. ఉమ్మెడ కాలభైరవస్వామి ఆలయం సమీపంలో కనుగొన్నారు. శక సంవత్సరం 939, పింగళ సంవత్సరాది, అశ్వయుజ శుద్ధ షష్ఠి ఆదివారం అనగా క్రీ.శ.1,017 సెప్టెంబరు 29న వేశారు.

గతంలో లభించిన శాసనాలు..

- భీమ్‌గల్ మండల కేంద్రంలో పాత శివాలయం వద్ద కల్యాణి చాళుక్యులు కన్నడ వేసిన శాసనం వెలుగు చూసింది. శాలివాహన శకం 1027 క్రీ.శ. 1105 మార్చి 30న వేశారు. భీమ్‌గల్-2 శాసనాన్ని క్రీ.శ.1046 ఫిబ్రవరి 9న దీన్ని వేశారు.
- బిచ్కుంద మండల కేంద్రంలోని శంభుదేవుని గుడి వద్ద కల్యాణి చాళుక్య త్రిభువనమల్లు వేయించారు.
- బాన్సువాడ తాలూకా చిల్లర్గి చెరువు వద్ద శాలివాహన శకం 980(క్రీ.శ.1058 మార్చి 27)న ఈ శాసనం వేశారు. బాన్సువాడ సమీపంలోని నందలి పుల్కల్ గ్రామంలో కల్యాణి చాళుక్య త్రిభువనమల్లు శాలివాహన శకం 1010 (క్రీ.శ.1088 డిసెంబర్ 21)న వేశారు. ఇక బాన్సువాడ తాలూకా విజాద్‌నగర్ వద్ద 6వ చాళుక్య త్రిభువనమల్ల విక్రమాదిత్య శాలివాహన శకం 1020 (క్రీ.శ. 1098 డిసెంబర్6న) వేయించారు.
- ఆర్మూర్ మండలం ఖుదావన్‌పూర్ చెరువు వద్ద చాళుక్యులు శాలివాహన శకం 1004 (క్రీ.శ.1082 డిసెంబర్ 3)న వేయించిన శాసనం లభ్యమైంది.
- కామారెడ్డి తాలూకా కుప్రియాల్ వద్ద కాకతీయ రాజు గణపతిదేవుడు శాలివాహన శకం 1143 (క్రీ.శ.1221 ఏప్రిల్ 17)న శాసనం వేయించారు. కుప్రియాల్ వద్ద రుద్రమదేవి శాలివాహన శకం 1203 (క్రీ.శ.1281 జూలై 19)న శాసనం వేయించారు.
- జుక్కల్ తాలూకాలోని గుండెనంబి గ్రామం వద్ద 6వ చాళుక్య విక్రమాదిత్య త్రిభువనమల్ల కాలంలో శాలివాహన శకం 1021 (క్రీ.శ.1099 సెప్టెంబర్19)న శాసనం వేశారు. గాంధారి సమీపంలోని గుజ్జుల గ్రామం వద్ద చాళుక్యులు వేయించిన శాసనం లభించింది.
- బోధన్ సమీపంలోని పెంటాకుర్ద్ వద్ద త్రైలోక్యమల్ల రాజ్యకాలంలో శాలివాహన శకం 980 (క్రీ.శ.1059)న శాసనం వేయించారు.
- బాన్సువాడ సమీపంలోని దుర్కి గ్రామం వద్ద కల్యాణి చాళుక్య 6వ త్రిభువనమల్ల విక్రమాదిత్య కాలంలో వేసిన శాసనం లభ్యమైంది. దుర్కి-2 శాసనం సైతం కల్యాణి చాళుక్యులే వేయించారు.
- నాగిరెడ్డిపేట మండలం చీనూరు వద్ద కుమార తైలవుని పాలనా కాలంలో శాలివాహన శకం 995 (క్రీ.శ.1073)లో శాసనం వేయించారు.
- బాన్సువాడ శివాలయం వద్ద చాళుక్య రాజైన 3వ భూలోకమల్ల సోమేశ్వర పాలనా కాలంలో శాలివాహన శకం 1059 (క్రీ.శ.1137 నవంబర్ 15)న వేసిన శాసనం వెలుగుచూసింది.
- బోధన్ పట్టణం, సమీపంలో అనేక శాసనాలు వెలుగు చూశాయి. ఉద్మీర్‌గల్ వద్ద ఒక శాసనం, పంప సమాధి వద్ద చాళుక్యుల కాలంలో శాలివాహన శకం 963 (క్రీ.శ.1041 డిసెంబర్ 16)న శాసనం, ఇక్కడే మరో శాసనం, ఇక్కడే మరో రెండు శాసనాలు లభించాయి. శాలివాహన శకం 978 (క్రీ.శ.1056 మే 30)న వేసిన మరో శాసనం కనుగొన్నారు.
- బాన్సువాడ వద్ద దేశాయిపేట గ్రామంలో కన్నడ తెలుగు భాషలో మరో శాసనం వెలుగు చూసింది. దీని ప్రకారం బాన్సువాడకు సంబంధించి ప్రత్యేక విషయం తెలిసింది. బనవాసవాడి నుంచి బానసవాడ తరువాత బాన్సువాడగా పేరు మార్పు చెందినట్లు తెలిసింది.
- కోటగిరి వద్ద కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి శాలివాహన శకం 1195 (క్రీ.శ.1273 డిసెంబర్ 31)న వేయించిన శాసనం దేవనాగర, సంస్కృత భాషలో చెక్కించారు. ఇక బాన్సువాడ వద్ద బీర్కూర్ చెరువులో చేపల వేట సమయంలో కాకతీయులు సంస్కృత భాషలో వేసిన తామ్ర శాసనం లభించింది.

నోరు జారితే మూల్యం చెల్లించక తప్పదు

- 'సాక్షి' లో ప్రచురితమైన జీవన్ రెడ్డి అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తాం
- కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి



ఆర్మూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న పొద్దుటూరి వినయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్: ఖబడ్దార్.. కాంగ్రెస్ ముఖ్య నాయకుల గురించి నోరు జారితే తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి హెచ్చరించారు. ఆర్మూర్‌లో ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తనపైన కూడా జీవన్ రెడ్డి అనవసరమైన అసత్య ఆరోపణలు చేస్తున్నాడని వినయ్ రెడ్డి మండిపడ్డారు. తనపై అవినీతి ఆరోపణలు చేసిన జీవన్ రెడ్డి సిద్ధిలగుట్ట సాక్షిగా ప్రమాణం చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని వినయ్ సవాల్ విసిరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఆర్మూర్‌లో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపెట్టామన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే హయాంలో అక్రమ ఇంటి నెంబర్లతో పాటు ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడ్డ విషయాన్ని గుర్తు చేసారు. ఎమ్మెల్యే పదవిని అడ్డం పెట్టుకొని ఆర్మూర్ నియోజకవర్గంలోని మాణిక్ బండార్ శివారులో సుమారు 170 నుంచి 200 ఎకరాల్లో చేసిన వెంచర్‌లో ప్రభుత్వ భూములు కలుపుకొని చేసిన అవినీతి అక్రమాల చిట్టా 'సాక్షి'దిన పత్రికలో వచ్చిందని అన్నారు. ఆ వెంచర్లకు రెండు బ్రిడ్జిలు ప్రభుత్వ సొమ్ముతోనే వేయించారని అన్నారు. త్వరలోనే విచారణ చేయించి అవినీతి అక్రమాలు బయటపెడతామన్నారు. ఆర్మూర్ పట్టణ కేంద్రంలో బక్రుగుట్ట వద్ద రైతులను బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకొని దాని పక్కనే ఉన్న మిగతా భూములను ఆక్రమించిన విషయం, ఆయన తమ్ముడు రాజేశ్వర్ రెడ్డి ప్రభుత్వ భూములను కలుపుకొని చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపార అవినీతి చిట్టాను బట్టబయలు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్ను, కౌన్సిలర్లు ఆకుల రాము, లిక్కి శంకర్, ఇంతియాజ్, నాయకులు పండిత్ పవన్, కొంతం మురళి, రెహమాన్, పార్టీ మండలాల అధ్యక్షులు ముక్కెర విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై చీఫ్ సెక్రెటరీకి ఫిర్యాదు

- ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



సమీక్షలో పాల్గొన్న సునీల్, వినయ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి ప్రొటోకాల్ అంశాన్ని తుంగలో తొక్కిన జిల్లా కలెక్టర్, ఇతర సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి శనివారం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో, ఏవిధమైన అధికారిక బాధ్యతలు లేని ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి, పొద్దుటూరి వినయ్‌రెడ్డిలను అధికారిక వేదిక మీద కూర్చోబెట్టడమేమిటంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను జతచేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగో విడత రుణమాఫీ!



దత్తాపూర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

- జిల్లాకు రూ. 155.81 కోట్లు కేటాయించినట్లు పోర్టల్‌లో పెట్టిన సర్కారు
- 17,551 మంది రైతుల ఖాతాల్లో జమ కానున్న నిధులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మేరకు రైతు రూ. 2 లక్షల రుణమాఫీ దాదాపు పూర్తయినట్లే. ఎందుకంటే రేషన్ కార్డు లేక రుణమాఫీ కాని రైతులకు కూడా రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 17,551 మంది రైతులకు రూ.155.81కోట్లు ఇచ్చినట్లుగా వివరాలను శనివారం వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పెట్టింది. త్వరలోనే సంబంధిత రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతల్లో 83,061 మంది రైతులకు రూ. 626.49 కోట్ల రుణమాఫీ జరిగింది. రేషన్ కార్డున్న రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరుగగా, లేని వారికి వ్యవసాయాధికారులు కుటుంబ నిర్ధారణ చేసి ప్రభుత్వానికి నివేదించారు. వివరాల ఆధారంగా ఇప్పుడు రేషన్ కార్డు లేని రైతులకు కూడా ప్రభుత్వం రుణమాఫీ చేస్తోంది. నాలుగో విడత రుణమాఫీ జాబితా విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల పేర్ల జాబితా శనివారమే వాట్సప్‌లలో వైరల్ కూడా అయ్యింది.

సంబరాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ నిధులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో సంబరాలు నిర్వహించారు. రూ.2 లక్షల రుణమాఫీపై ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని, అలాగే వడ్లకు బోనస్ ఇచ్చిందని, త్వరలోనే పంట పెట్టుబడి సాయం కూడా అందజేస్తుందని డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశరం భూమేశ్ రెడ్డి అన్నారు. రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నామన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

నిజామాబాద్‌అర్బన్/డిచ్‌పల్లి: జిల్లాలోని పలు పాఠశాలలు, కేజీబీవీలను ఆర్‌జేడీ వరంగల్ సత్యనారాయణరెడ్డి, మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ శనివారం సంయుక్తంగా తనిఖీ చేశారు. నగరంలోని రెండు ప్రభుత్వ పాఠశాలలను, డిచ్‌పల్లిలోని కస్తూర్బా పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులను పాఠాలపై ప్రశ్నించారు. విద్యార్థులు చక్కగా సమాధానం చెప్పడంతో అభినందించారు. మంచి మార్కులతో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం వంటశాలకు వెళ్లి నిల్వ ఉన్న సామగ్రిని పరిశీలించారు. పక్కనే గల ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు.



కేజీబీవీ రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణ



కేజీబీవీ బాలికలతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

ఏడవ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా సత్యనారాయణ



డిచ్ పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీజీఎస్పీ) ఏడవ బెటాలియన్ డిచ్‌పల్లి ఇన్‌చార్జి కమాండెంట్‌గా అడిషనల్ కమాండెంట్ పి సత్యనారాయణ నియామక మయ్యారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక్కడ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసిన ఐపీఎస్ అధికారి రోహిణి ప్రియదర్శిని గత నెల 20న కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు వెళ్లడంతో ఆమె స్థానంలో మూడవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ గా ఉన్న ఎంఐ సురేష్ ఇన్‌చార్జి కమాండెంట్ గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయనను వరంగల్ మామునూర్ 4వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం పి సత్యనారాయణ ను ఇన్‌చార్జి కమాండెంట్‌గా నియమించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సత్యనారాయణ ఇన్చార్జిగా కొనసాగనున్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్‌ సెమిస్టర్‌ పరీక్షల్లో శనివారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఆరుగురు విద్యార్థులు డిబారైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 8,184 మందికి 7,831 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 6,501 మందికిగాను 5,993 మంది హాజరు విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు ఎంపిక



డిచ్‌పల్లి : రాష్ట్రస్థాయి హ్యాండ్‌ బాల్‌ పోటీ లకు మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని సంకీర్తన ఎంపికై నట్లు ప్రిన్సిపాల్‌ నళిని తెలిపారు. ఆర్మూర్‌ మినీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో సంకీర్తన పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంకీర్తనను వైస్‌ ప్రిన్సిపాల్‌ స్వప్న, జూనియర్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ వనిత, పీడీ జ్యోత్స్న, పీఈటీ శ్రీలత, అకాడమీ కోచ్‌ వేముల మౌనిక అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని మూడు ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో తెలుగు పండిత్‌ గ్రేడ్‌–2 పోస్టును, వర్నిలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో స్కూల్‌ అసిస్టెంట్‌ ఫిజిక్స్, సైన్స్‌ సబ్జెక్టులకు సంబంధించి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తెలుగు పండిత్‌కు రూ.21,255, స్కూల్‌ అసిస్టెంట్‌కు రూ.28,977 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య పోటీలు


నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి సాంస్కృతిక నృత్య పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. దేశభక్తి, జానపద పోటీల్లో వసతిగృహాల విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశామని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటీవ్‌ యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానల మోహన్‌రెడ్డి హాజరయ్యారు. అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్రవంతి, నర్సయ్య, గంగాధర్, స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ వెంకన్న పాల్గొన్నారు.

ముగ్గురు టీచర్లకు నోటీసులు

బోధన్‌రూరల్‌: మండలంలోని కొప్పర్గలో ఉన్న ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి నోటీసులు జారీ చేశారు. శనివారం ఉదయం ఎంఈవో నాగయ్య పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా, ఉపాధ్యాయులు ఖాజామోయిన్, అతీఖుద్దీన్, రహీముద్దీన్‌ విధులకు ఆలస్యంగా వచ్చారు. దీంతో వివరణ కోరుతూ ఆ ముగ్గురికి నోటీసులు ఇచ్చారు. టీచర్లు వివరణ ఇచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

మహమ్మారి మాయమవుతోంది!

- 2006లో 1857 కేసులు.. ఈ ఏడాది ఇప్పటి వరకు 237 నమోదు
- క్రమంగా తగ్గుతున్న ఎయిడ్స్‌ కేసులు
- ఎయిడ్స్‌ రహిత జిల్లా దిశగా అడుగులు..
- నేడు వరల్డ్‌ ఎయిడ్స్‌ డే



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఎయిడ్స్‌ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మహమ్మారిని నిర్మూలించేందుకు జాతీయ ఎయిడ్స్‌ నివారణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో సంబంధిత అధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 2006లో 1857 కేసులు(5.25శాతం) నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 237(0.45) కేసులు నమోదయ్యాయి. జిల్లాను త్వరలోనే ఎయిడ్స్‌ రహిత జిల్లాగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు చైతన్యవంతులను చేసేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు.



జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని సంపూర్ణ సురక్ష కేంద్రంలో అధికారులు

53,245 మందికి టెస్టులు

ఈ ఏడాది ఏప్రిల్‌ నుంచి అక్టోబర్‌ వరకు 53,245 మందికి ఎయిడ్స్‌ నిర్ధారణ టెస్టులు చేయగా, 237 మందికి పాజిటివ్‌ వచ్చింది. 16 మంది గర్భిణులకు చికిత్స అందిస్తున్నారు. మరో 11 మందికి పాజిటివ్‌ డెలివరీలు అయ్యాయి. హెచ్‌ఐవీ సోకిన 17మంది తల్లుల నుంచి పుట్టిన బిడ్డలకు మహమ్మారి సోకకుండా కాపాడారు. జిల్లా జైలులో 1221 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్‌ వచ్చింది. వారికి చికిత్స అందిస్తున్నారు. స్నేహ సొసైటీ 239మందికి ఉచితంగా రేషన్‌ అందజేస్తున్నారు. గతేడాది కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఇద్దరు సెక్స్‌వర్కర్లు ఉద్యోగాలు ఇచ్చారు.

విస్తృత అవగాహన

జిల్లాలో 'పల్లె సుద్దులు' కార్యక్రమం పేరుతో కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు ఎయిడ్స్‌ నియంత్రణ, రక్తదానం ఆవశ్యకత తదితర అంశాలపై క్విజ్, 5కే రన్, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. హోర్డింగ్‌లు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

హై రిస్క్‌లో ఉన్నా..

సంపూర్ణ సురక్ష కేంద్రంలో టెస్టులు నిర్వహించి జిల్లాలో సుఖవ్యాధుల బారినపడిన వారిని 14,482 మందిని గుర్తించారు. వారిలో 8,104 మందికి చికిత్స అందిస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌ నుంచి ఈఏడాది అక్టోబర్‌ వరకు హెచ్‌ఐవీ నెగెటివ్‌ వచ్చి సుఖవ్యాధులు ఉన్న 2421 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి సెంటర్‌కి పిలిపించి టెస్టులు చేయగా ఎవరికీ పాజిటివ్‌ రాకపోవడం శుభపరిణామం.

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

జిల్లాను హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కలిసి కార్యక్రమాలు చేపడుతున్నాం. గతంతో పోలిస్తే ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరిగింది. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు బాధితులకు అందిస్తున్నాం. జిల్లాను హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. – దేవినాగేశ్వరి, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి(ఎయిడ్స్, లెప్రసీ)

హెచ్‌ఐవీ బాధితుల సంఘం ఏర్పాటు



రాష్ట్రంలోనే జిల్లాలో మొదటిసారి హెచ్‌ఐవీ బాధితులతో వర్ద్‌ స్వచ్ఛంద సంస్థ సహకారంతో హెచ్‌ఐవీ బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1145 సభ్యులతో విజేత పరస్పర సహకార సంఘం మాక్స్‌ సొసైటీని ప్రారంభించారు. సభ్యులు ప్రతి నెలా ఒక చోట సమావేశం ఏర్పాటు చేసుకొని తమ ఆరోగ్య సమస్యలతోపాటు డబ్బు పొదుపు వివరాలపై చర్చిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.8లక్షలు జమ చేసుకున్నారు.

సంవత్సరం	టెస్టులు	పాజిటివ్‌	శాతం
2016-17	79,583	631	0.8
2017-18	1,05,502	510	0.5
2018-19	91,260	534	0.6
2019-20	82,138	525	0.6
2020-21	68,978	352	0.5
2021-22	75,171	405	0.5
2022-23	1,14,813	451	0.4
2023-24	1,29,630	538	0.4
2024 (అక్టోబర్‌ వరకు)	53,245	237	0.4

ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్‌

- రాజీ మార్గంలో కేసుల పరిష్కారం
- ఇన్‌చార్జి జిల్లా జడ్జి కనకదుర్గ



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి జడ్జి కనకదుర్గ

ఖలీల్‌ వాడి: ఈనెల 14న జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గ తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందితో జాతీయ లోక్‌ అదాలత్‌ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. సివిల్‌ దావాలు, రాజీపడదగిన క్రిమినల్‌ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. అప్పీలుకు వీలులేని విధంగా సదరు కేసులను చట్టం గుర్తిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కార వేదిక జాతీయ లోక్‌ అదాలత్‌ అని అన్నారు. పోలీసుశాఖ లోక్‌ అదాలత్‌ విజయవంతానికి కృషి చేస్తుందని అదనపు పోలీస్‌ కమిషనర్‌ బస్వారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, జూనియర్‌ సివిల్‌ జడ్జీలు కుష్బూ ఉపాధ్యాయ్, శ్రీనివాసరావు, చైతన్య, హరికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గ సూచించారు. లోక్‌ అదాలత్‌ సన్నాహక సమావేశ అనంతరం సంబంధిత అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులకు సైబర్‌ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌ కాల్స్‌ను నమ్మొద్దని, చట్టంలో డిజిటల్‌ అరెస్ట్‌ అనేది లేదని స్పష్టం చేశారు. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు 2023లో సైబర్‌ నేరగాళ్లకు చిక్కి సుమారు రూ.1700 కోట్ల రూపాయలు నష్టపోయారన్నారు. అనంతరం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు.

బీఆర్‌ఎస్‌ నాయకులు బహిరంగ చర్చకు రావాలి



విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

- కాంగ్రెస్‌ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు
- ఎన్నికల హామీలపై చర్చకు మేం సిద్ధం
- రైతులకు బోనస్‌ చెల్లింపును వారు జీర్ణించుకోలేకపోతున్నారు
- జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలుచేస్తుంటే జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్‌ నాయకులు మతిభ్రమించి వ్యాఖ్యలు చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, 11 నెలల కాంగ్రెస్‌ పానలో అమలు చేస్తున్న హామీలపై జిల్లా బీఆర్‌ఎస్‌ నాయకులు చర్చకు రావాలని సవాల్‌ విసిరారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న హామీలపై ఇప్పటి వరకు ఎన్నోసార్లు వివరించామని, అయినా వారి చెవికి ఎక్కడం లేదన్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌పై పదే పదే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 చొప్పున బోనస్‌ ఇస్తుండడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరుగుతుందని, దాంతో బీఆర్‌ఎస్‌ నాయకుల నోట్లో పచ్చి వెలక్కాయపడటం ఖాయమన్నారు. పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై కూడా విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావును తీసుకువచ్చినా తాము చర్చకు సిద్ధమేనన్నారు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు తిరగలేని పరిస్థితి వచ్చిందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను సైతం ప్రకటిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు జావేద్‌ అక్రమ్, రామర్తి గోపి, వేణు రాజ్, రత్నాకర్, నరేందర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, చిన్న రాజేశ్, వినయ్, సుభాష్, ఆకుల మహేందర్, సాయికిరణ్, హరీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌ కళాశాలలో సదుపాయాల కల్పన



సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

మాక్లూర్‌: మండల కేంద్రంలోని నర్సింగ్‌ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నర్సింగ్‌ కళాశాలను శనివారం ఆయన సదర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాలలో ఉన్న సీట్లకు అనుగుణంగా అడ్మిషన్లు పూర్తయ్యాయా? అని ప్రిన్సిపాల్‌ మోనికా విలాసిని అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ లేక భయంగా ఉందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే కళాశాల నుంచి ప్రధాన రహదారి వరకు రోడ్డు వేయాలని కోరగా, ఉపాధి హామీ పథకం కంపోనెంట్‌ నిధులతో రోడ్డు నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇతర పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. కలెక్టర్‌ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్‌ శేఖర్, ఎంపీవో టి శ్రీనివాస్‌ తదితరులున్నారు.

జాతీయ స్విమ్మింగ్‌లో ఐదు పతకాలు



మిట్టపల్లి రిత్విక

నవీపేట: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నవంబర్‌ 28 నుంచి 30వ తేదీ వరకు కొనసాగిన 2024–25 ఈస్ట్‌ జోన్‌ యూనివర్సిటీ నేషనల్‌ స్థాయి స్విమ్మింగ్‌ పోటీల్లో మండలంలోని బినోల గ్రామానికి చెందిన క్రీడాకారిణి మిట్టపల్లి రిత్విక ఐదు పతకాలు సాధించింది. రెండు బంగారు, మూడు సిల్వర్‌ పతకాలున్నాయి. రిత్వికను అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్య నారాయణ గుప్త, రాష్ట్ర స్విమ్మింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమేశ్, ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు గడీల శ్రీరాములు, సభ్యులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాగిణి తదితరులు అభినందించారు. రిత్విక తండ్రి ప్రకాశ్‌రావ్‌ తన కూతురు సాధించిన విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.

4న కౌలు రైతుల ప్రజాదర్బార్‌



నిజామాబాద్‌ సిటీ: కౌలు రైతుల గుర్తింపు కోసం ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న కౌలు రైతుల ప్రజాదర్బార్‌ ధర్నాను విజయవంతం చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్‌ కోరారు. నగరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీల్లో ప్రధానంగా వ్యవసాయ రంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతు పండుగ నిర్వహించడం దండగేనని అన్నారు. రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులు ఉండగా, రైతు ఆత్మహత్యల్లో 75శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారన్నారు. రైతు భరోసా లేకుండాపోయిందని, 11 రకాల పంటలకు రూ.500 బోనస్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలోని 22 లక్షల మంది కౌలురైతుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్‌ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాదర్బార్, ధర్నా విజయవంతం చేయాలన్నారు.

క్రైం కార్నర్‌

ఒకరి దారుణ హత్య



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌ రెడ్డి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి గాంధీ గంజ్‌ ఆవరణలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శనివారం ఉదయం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కూలీ పనులు చేయడంతోపాటు కాగితాలు ఏరుకుంటూ నిర్మాణంలో ఉన్న గంజ్‌ ఇంటిగ్రేటెడ్‌ కాంప్లెక్స్‌లో కొంత కాలంగా 10 మందికి పైగా ఉంటున్నారు. వారిలో సాయి అలియాస్‌ యేసు (35) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని కర్రలు, రాళ్లతో తలపై బలంగా కొట్టి హత్య చేశారు. అర్ధరాత్రి సమయంలో హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించి విచారణ చేపట్టారు. డాగ్‌ స్క్వాడ్‌ను రప్పించారు. అక్కడే ఉన్న ఓ వృద్ధురాలిని విచారించారు. మృతుడితోపాటు కాంప్లెక్స్‌లో ఉన్న వారిని విచారిస్తున్నామని సీఐ తెలిపారు. ఇతర రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు కూడా అక్కడే నివాసముంటున్నారని, వారే హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం కల్లూర్‌ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కోటగిరి ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం వాజీద్‌నగర్‌కు చెందిన ఎం సాయిలు(48) బైక్‌పై హున్సా వైపు నుంచి వెళ్తుండగా కల్లూర్‌ శివారులో మరో బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న బరంగెడిగి సాయిలుకు తీవ్రగాయలయ్యాయి. క్షత గాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సందీప్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.10 కోట్లకు వ్యాపారి ఐపీ?

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌యార్డులో కమీషన్‌ ఏజెంట్‌ పి రాజారాం అండ్‌ సన్స్‌ యజమాని రూ.10కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలిసింది. సదరు కమీషన్‌ ఏజెంట్‌ గత వారం రోజులుగా పరారీలో ఉన్నట్లు సమాచారం. ఆయన ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయారని, ఫైనాన్షియర్లు, ఇతర వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నట్లు తెలిసింది. రైతులకు, కమీషన్‌ ఏజెంట్‌ ఐపీ పెట్టడానికి ఎలాంటి సంబంధం లేదని, రైతులెవరికీ ఆయన అప్పుగా లేరని మార్కెటింగ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో పలువురు వ్యాపారులు రైతుల వద్ద పంట ఉత్పత్తులను తీసుకుని ఐపీ పెట్టిన ఘటనలు ఉన్నాయి.

బైక్‌ చోరీ నిందితుడి గుర్తింపు



ఖలీల్‌వాడి: నగరంలో బైక్‌ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గుర్తించినట్లు ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. నిందితుడి వివరాలు తెలిసిన వారు లేదా గుర్తుపట్టే వారు 8712659837 నంబర్‌కు లేదా పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం అందించాలని ఆయన కోరారు.

మెండోరాలో దొంగల అలజడి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు అలజడి సృష్టించారు. దీంతో గ్రామస్తులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. రాత్రి పది గంటల తరువాత వడ్డెర కాలనీలోని ముళ్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు కాలనీకి చేరుకొని గ్రామస్తులతో కలిసి గాలించారు. గత వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ చేయాలని కోరుతున్నారు.

మాజీ సర్పంచ్‌పై కేసు

మోపాల్‌: మండలంలోని బైరాపూర్‌ మాజీ సర్పంచ్‌ సరిచంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సరిచంద్‌ కొడుకుకు అదే గ్రామానికి చెందిన అంబర్‌సింగ్‌ గతంలో డబ్బులు ఇప్పించాడు. కొన్నేళ్ల క్రితం సరిచంద్‌ కుమారుడు మృతి చెందడంతో అంబర్‌సింగ్‌ డబ్బుల విషయం అడిగాడు. మృతుడి భార్యతోపాటు సరిచంద్‌ డబ్బులు ఇస్తామని ఒప్పుకున్నారు. దీన్ని మనస్సులో పెట్టుకున్న సరిచంద్‌ రెండు రోజుల క్రితం కారు అడ్డుగా పెట్టావని అంబర్‌సింగ్‌తో గొడవకు దిగాడు. కారంపొడి, కత్తితో అంబర్‌సింగ్‌ను చంపేస్తానని బెదిరించాడు. బాధితుడు అంబర్‌సింగ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్‌కు జరిమానా

మోపాల్‌: మండలకేంద్రం నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ శనివారం తెలిపారు. టిప్పర్‌ను మైనింగ్‌ అధికారులకు అప్పగించగా, వారు రూ.4వేల జరిమానా విధించారన్నారు. అనంతరం టిప్పర్‌ను రిలీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు


సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్‌ గ్రామంలో సర్వే నంబర్‌ 17లో పబ్బ బాలయ్య అనే వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని అదే గ్రామానికి చెందిన పబ్బ రమేశ్‌ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. అక్రమ ఇంటి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మండల స్థాయి అధికారులను డీపీవో ఆదేశించారు.

పోలీసు శాఖ సహకారం ఎప్పటికీ ఉంటుంది



ఖలీల్‌వాడి: ఉద్యోగ విరమణ చేసిన వారికి శాఖ సహకారం ఎప్పటికీ ఉంటుందని, ఎటువంటి రిమార్క్‌ లేకుండా సర్వీసు పూర్తి చేయడం అభినందనీయమని అదనపు డీసీపీ(అడ్మిన్‌) కోటేశ్వరరావు అన్నారు. పోలీసుశాఖలో ఆర్‌ఎస్సైగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కొంకటి సదానందంను శనివారం ఆయన ఘనంగా సన్మానించారు. స్పెషల్‌ బ్రాంచ్‌ ఏసీపీ ఎస్‌ శ్రీనివాస్‌ రావు, ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌ వేసీపీ నాగయ్య, పోలీస్‌ కార్యాలయం సూపరింటెండెంట్లు శంకర్, స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'ఆకాశవాణి కదంబ'లో సిర్‌పూర్‌ విద్యార్థులు



మోపాల్‌: మండలంలోని సిర్‌పూర్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిజామాబాద్‌ ఆకాశవాణి శనివారం నిర్వహించిన 'ఆకాశవాణి కదంబ' కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలభారతి కార్యక్రమం కింద విద్యార్థుల కార్యక్రమాన్ని రికార్డ్‌ చేశారు. పాటలు, పద్యాలు, కవితలు, నాటికల సమాహారంగా కార్యక్రమం సాగింది. విద్యార్థులు చక్కని ప్రదర్శన కనబర్చడంతో వారితోపాటు తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్‌ హజారే శ్రీనివాస్‌ ప్రధానోపాధ్యాయుడు వి సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో రేడియో స్టేషన్‌ అధికారి మోహన్‌ దాస్‌ పాల్గొన్నారు.